# తెరిపి మరపులు 

రామచంద్రయ్య ఒక్కగానొక్క కూతురు స్టేట్స్ నించి వక్కతే వచ్చింది. పెద్ద లగేజ్ లేదు. చిన్న సూట్‌కేస్. వస్తున్నానని తెలియజేయనన్నాలేదు. కూతురి కన్న పెద్దవాళ్లైన కొడుకులిద్దరూ, భాగం పంచమని, తమ వంతు అమ్మేసుకుని మహానగరాలకి వుద్యోగరీత్యా వెళ్లి పోయారు. వాళ్లే పెళ్లిళ్లు కానిచ్చుకుని గృహస్థులైనారు. సహభాగినులూ వుద్యోగస్థులే. రామచంద్రయ్య సంతోషించాడు. ఆయన డిటాచ్‌మెంట్ సాధన చేశాడు. అంతా దైవమే చేస్తాడు. యేది యెందుకు చేస్తాడో తెలియదు. భార్య కోమల గుండెపోటు వచ్చిపోయింది. యెన్ని జరిగినా రామచంద్రయ్య స్వంతవూరూ, భూమి వదిలి వెళ్లలేదు. యెప్పుడైనా విద్వత్ సభలకి వెళ్తాడంతే. సన్మానాలు నిరసించాడు. శ్రద్ధాభక్తులు చూపితే, తెలుగు సంస్కృతం నేర్పుతాడు, ఉభయ భాషా ప్రవీణ రామచంద్రయ్య. గ్రంథాలిచ్చి, ముందుమాట, వ్యాఖ్య, పీఠిక వ్రాసివ్వమంటే యిస్తాడు. రాజకీయాలిష్టం లేదు. ఆయుర్వేదం నేర్చి, వైద్యం చేస్తున్నాడు. నిరాడంబర జీవి. భార్యా కోమల యెమ్మే తెలుగు. ఆచార్య బిరుదు తెచ్చుకున్నది. మామ కూతురే. కాలేజీ లెక్చరర్ చేసింది. రిటైర్ కానే లేదు. ఆమేవేపు అంతా ఎడ్యుకేటెడ్. కోమలకీ ఆడంబరము యిష్టం లేదు. మహానగర జీవితమూ యిష్టం లేదు.

కూతురి పేరు పరమేశ్వరి. వచ్చిందని సంతోషించాడు. ఇల్లు కలకలలాడింది. పిల్లలకు శలవులేదు అందుకని రాలేదన్నది. కాని వారం తిరక్కముందే పడక వేసింది పరమేశ్వరి. తండ్రే వైద్యం చేస్తున్నాడు.

''నాన్నా! నేను శఠించి పెళ్లన్నా ఆడకుండా స్టేట్స్‌కి వెళ్లిపోయానని బాధపడ్డావా?''

''లేదమ్మా! పరా! మేడమ్ బ్లావస్కీ చెప్పినవి చదివాను. నాకు నచ్చాయి. దివ్యజ్ఞాన సమాజసభ్యుడనైనాను. ప్రతీ వ్యక్తికీ, వాక్ స్వాతంత్ర్యము, వ్యక్తిగత స్వాతంత్ర్యము, ఆలోచనా స్వాతంత్ర్యము, మత స్వాతంత్ర్యము వుండాలన్నది.

తమ బుర్రల్లోనివి యితరుల బుర్రల్లోకి యెక్కించరాదన్నది. బలవంతంగా మతమిప్పించరాదన్నది. తమ ఆశయాలు యితరుల నెత్తిన రుద్దరాదన్నది. బిడ్డలను కనిపెంచటం, ఆత్మానందం కోసం. అది జీవ లక్షణం. కలగకపోతే విచారించరాదు. భగవంతుడివ్వలేదనకు. యితరుల బిడ్డలను పెంచవచ్చు. అవన్నీ నాకు బాగున్నాయమ్మా''.

''నీకు నా గృహస్థ జీవితాన్ని గురించీ తెలియజేయలేదు నాన్నా. నా పార్టనర్ని గురించీ తెలియజేయలేదు. అదంతా పొరపాటే గాక, యిగో గూడాను. ఆ యిగోని దించేయ లేకపోయినా కంసుని లాగా. నువే చెప్పావు నాన్నా. మధురానగరమంటే యీ శరీరం. కంస అంటే యీ శరీరంలో పెరిగిపోయే యిగో. దానిని కంట్రోల్ చేసుకో లేకపోయినా, దించేయలేకపోయినా, పరమాత్మే స్వయంగా వచ్చి దింపేస్తాడు. దయానిధి కృష్ణ పరమాత్మ. కాళీయుని కథలో కాళీయుని భార్యలు అదే అన్నారన్నావు. ''కృష్ణా! దయానిధీ! నీవే స్వయంగా వచ్చి కాళీయుని యిగో దింపేశావు. మేము చెప్తే విన్నాడు గాదు. నీకెంత దయ'' అన్నారని'' అని తండ్రి వంక చూసింది పరమేశ్వరి.

మంచం పక్కన కుర్చీలో వున్నాడు తండ్రి. తల మీద రాస్తున్నాడు.

''చాలా గుర్తున్నాయి పరా. అందునా మంచి విషయాలు. నిద్రపట్టించుకో తల్లీ. యేదో వ్యథ తెలుస్తున్నది. అదేమిటో. ''మెత్తని తువాలుతో పరమేశ్వరి మొహాన యేర్పడిన స్వేద బిందువును అద్దాడు. మొహం తుడిచాడు. చిన్నిముత్యాలలాగా యేర్పడ్డాయి స్వేద బిందువులు. మళ్లా అద్దాడు. లేవదీసి పండురసం తాగించి మళ్లా పడుకోబెట్టాడు.

'' ఇది మాయ. మిథ్య. నిజంగాదు. మన చుట్టూ మాయ ఆవరించి వుంటుందని తెలిసింది నాన్నా. శఠగోపురం పెట్టించుకుంటే, ఆమాయ మనల్ని యేమీ చేయలేదనీ, దైవం కాపాడుతూ వుంటాడనీ విష్ణ్వాలయంలో విష్ణుపాదాలూ, శివాలయంలో శివుని పాదాలూ, వెంకటేశ్వరుని సన్నిధానంలో వెంకటేశ్వరుని పాదాలూ వున్న గోపురం, తల మీద పెట్టే దందుకే అన్నావు నాన్నా''.

''అవునమ్మా నిద్ర పట్టించుకోవూ? మంచి నిద్ర తీస్తే రిలాక్సు అవుతావు. ఆవేశం, వుద్రేకం తగ్గిపోతాయి'' చేతుల మీదా మొహం మీదా రాచాడు తండ్రి.

కాని పరా నోరు మూతపడలేదు.

''మస్కా, మైదు, వంచన, టోపీ, బుట్ట బోర్లించటం, వూలు మొహం మీదికి లాగటం, వీటన్నిటికీ కొంచెం తేడాతో అర్థం ఒకటే నాన్నా. మాయను గెలిచినవారు లేరూ మరి మరి నీవు చూడూ అన్నారు. అట్టి మాయలో పడి ఒక మగాడిని చూసి జెంటిల్‌మాన్ అనుకున్నాను నాన్నా. మతిబోయింది. కులగోత్రాలూ, మతమూ అడగటం గూడా మరిచిపోయాను. దాసు నిజంగా దాసునిలాగే ప్రవర్తిస్తే గాఢానురాగం అని భ్రమించాను. అది భ్రమే. అది మోహమే. దాసు బాగా సాయపడేవాడు. అసలు నాన్నా! స్టేట్స్‌లో, జాబూ, మంచి రాబడీ స్వంతయిల్లూ, కారూ అనేవే కులగోత్రాలు. మంచి తెలుగు మాట్లాడుతూ, నాగరకత చూపితే, సంస్కారం గల వాడనుకున్నా. కల్ల. మగవారి వలపులు యెరగవే తుమ్మెదా అనేది నిజమైంది నాన్నా. అది వలపే. బ్రెయిన్ సవ్యంగా పని చేయని వారికి, కొత్త పద్ధతుల మీద, చదువూ, వైద్యమూ, సభ్యత, శుభ్రతా, శమదమాదులు, నియమ నిగ్రహాలూ, ప్రేయరు అంటే జపం నేర్పి, ప్రివెంటివ్ మెడిసిన్ లాగా పిన్నలకూ, పెద్దలకూ గూడా సవ్యంగా లైఫ్ లీడ్ చేసే పద్ధతులు నేర్పుతాడు దాసు. అదీ వుద్యోగం. అతని చేత పైవారు మానసిక వ్యాధులపై రిసెర్చ్ చేయించి పేపర్లూ రిలీజ్ చేయించారు. ట్రైనింగు అయినాడు. హౌస్‌సర్జన్ వంటిదీ పూర్తి చేశాడు. అసలు వైద్యం తనకే చేసుకోవాలనిపించలేదేమో నాన్నా. మనవూళ్లో నా చిన్నతనంలో ఒక ఘనజ్యోతిష్కుడుండేవాడు. ఆయన చెప్పింది అక్షరాలా నిజమయిందిట. కాని నాన్నా ఆయన తన జాతకం చూసుకుంటే బాగుండేదేమో'' అన్నది.

''తప్పమ్మా పరా! వ్యక్తిని క్రిటిసైజ్ చేయరాదు. విద్య విలువ తెలుసుకోవాలి'' అని తలమీద రాచాడు తండ్రి.

''సరే నాన్నా! నవ్యత యిష్టమన్నాడు దాసు. మోడరన్ లైఫ్ లీడ్

చేతామన్నాడు. నవవిధాన్ కనిబెట్టానన్నాడు. ఆ పేలుడు నమ్మాను. నష్టం లేదని అనిపించింది. గొట్టెలాగా తలూపాను. మేడిపండురంగు చూసి మేలిమిపండు అని భ్రమించాను. నిజం నిడివి మీద తెలిసింది. కళ్లు తెరుపుడు పడి వలపు తొలగిపోయప్పటికి మేడిపండు లోపలివి కనిపించాయి. డామినేషన్, జబర్దస్తీ, జులుమ్, అరోగెన్స్, అసభ్యత, వ్యానిటీ అవీ మేడిపండులో వున్నాయి. పారిపోనీయడనీ తేలింది. వెతికి తెస్తాడు. పొసెసివ్. బాల్యంలో రెగ్యులర్‌గా దైవదర్శనం చేసుకుని శఠగోపురం పెట్టించుకున్నాను. అపుడు మాయ నన్నేమీ చేయలేక పోయింది. ఇపుడూ పెట్టించుకుందామా అనిపించింది నాన్నా. ఈ మమకారం వదిలించుకోవాలి అదీ నా తాపత్రయం'' అంటున్నది.

''నువ్వింకా మానసికంగా యెదగాలి పరా. మాయచే ఆవరించబడి, వ్యధలూ, వేదనలూ అనుభవించటం గూడా దైవాన్ని ఆరాధించటమే. గొప్పే. లాభమే. రాపిడివల్ల సత్యం గోచరిస్తుంది. సత్యమే దైవము''.

''రామదాసు మాయచే కప్పబడే రామునికి ఆలయం కట్టించాడు. అది వసూల్‌చేసిన ధనం. అది ప్రజాధనం. పన్నుల రూపేణా చెల్లించినది. ఖజానాలో జమ చేయాలి. రామదాసుకి తెలియదా? తెలుసు. మతిబోయిందా? బందిఖానాలో బడి కొరడా దెబ్బలు పన్నెండేళ్లు తింటుంటే రాముడు స్పష్టంగా కనిపించాడు. కనకనే యెదురుగా వున్నవానిని దెప్పుతున్నట్లు ''యెన్ని చేశాను నీ కోసం? అదంతా యెవడబ్బ సొమ్మని కులుకుచూ తిరుగుతావు'' అని మళ్లా ''అబ్బా తిట్టితినని ఆయాసపడకయ్యా! రామచంద్రా! యీ దెబ్బలకోర్వలేక అబ్బా తిట్టి తినయ్యా రామచంద్రా!'' అని యెదురుగా కనిపిస్తున్నట్టే పాడాడు. కనకనే రామదాసు కీర్తనలు నేటికీ నిలిచి వ్యాప్తిలో వున్నాయి తల్లీ'' అన్నాడూరడింపుగా. రాని నవ్వు నవ్వుతూ, ''మొదట్లో మాటాడిన మంచి తెలుగెటుపోయిందో నాన్నా! రంకులు, బొంకులు, యెవరికెవరు పుట్టారో చెప్పటం, అశ్లీల పదాలు వాడుతూ నవ్వటం, ముద్రలు, అభినయం చూడలేక వినలేక తలపట్టిపోయింది. మాటల్లో తభావతు, కాపట్యం, లేకి స్వభావం

పైకితేలాయి నాన్నా. అమాయికత నటించటం. నిజంగా చూస్తే గడసరే. నాకు శ్రీరంగనీతులు చెప్తూ, పాతివ్రత్యం విలువ చెప్తూ, తాను దొమ్మరిగుడిశల్లో దూరి, అక్కడి వివరాలు నవ్వుతూ చెప్తే యేం కులమందాము నాన్నా? ప్రవరాఖ్యుడనంటూ, రాత్రిళ్లు లేట్‌గా వచ్చి, ''నేనేమీ చేయలేదు. పిలిస్తే వెళ్లాను. రాననటం నాగరకత గాదు. ధర్మరాజుని జూతమాడ వెళ్లవద్దని ద్రౌపది అబ్జెక్ట్ చేస్తే, ''రాజువై రాను అంటే పిరికివాడంటారు. వెళ్లాలి. వెళ్తాను'' అన్నాడుట ధర్మరాజు. యెవరినో మెప్పించటం కల్చరా? నాన్నా''.

''స్వంతబిడ్డ అనారోగ్యం పాలైతే, దానికి వెళ్లి పోవాలని ఉన్నది. భూలోకం బాగా లేదట'' అని నవ్వి, పరాయి బిడ్డ సుస్తీ పడితే విచారంగా చూస్తూ, పరాకుగా తిరుగుతూ ''వీడు బతికి బట్ట గట్టేనా? న్యుమోనియా ఎటాక్ చేసింది'' అని ఆ బిడ్డ ఆరోగ్యం పొందాక సంతోషంగా తిరిగాడు దాసు. యే మతస్థుడనుకోను నాన్నా?''.

''స్వంత ఫామిలీని గేలిచేస్తూ పరాయి బిడ్డలనూ, పరస్త్రీలను పొగడుతూ, మధ్యవర్తిగా మాచెస్ ఫిక్స్ చేస్తూ అదేనా నాన్నా నవవిధాన్, మోడరన్ లైఫ్? తను కుదిర్చిన తాను ఫిక్స్ చేసిన మాచెస్ యెన్ని సక్సెస్ అయినయ్యో చెపుతూ పరవశుడైతే, వయసు రాగానే తన సంతానానికీ ఫిక్స్ చేయాలనిపించలేదా అనిపించింది నాన్నా. గ్రాండ్‌పా అని పిలుస్తారని ఆ విషయం యెత్తడు మేడిపండు. హాస్యాలాడుతూ యెన్ని నిందలు నా మీద నాన్నా! నేను తిననుట ఒకరికి పెట్టనుట. రాతి యుగం, చీకటి యుగం నాటి మనిషిలాగా, రాతి పాత్రలు, రాతి పనిముట్లు వాడతానుట విదేశంలో గూడా. థింకింగ్ గూడా ప్రిమిటివ్ థింకింగ్‌ట నాది. సైంటిఫిగ్గా ఆలోచించనుట. యేం కులమిలా కించపరచమంటున్నదో? యేమతమిలా నా ఫీలింగ్స్‌ని హర్ట్ చేయమంటున్నదో? మన్మథ క్రీడలూ, సెక్స్ క్యూర్ టాపిక్స్ మీద యిష్టతతో ఖబుర్లాడుతుంటే, యెవరి పాలు తాగాడో పసితనంలో అనిపించింది నాన్నా. సోషలైట్ కాదుట నేను. ఒంటెత్తు గుణంట. నలుగురిలో మెలగటం నేర్చుకోమని యెవరుకంటబడితే

వారివెంట తోలాడు. మన వంట నేర్పమని, వారే నాకా పూట తిండిపెడ్తారని పంపాడు. నేనే స్వేచ్ఛగా వెళ్లివస్తే  అనుమానించి, గేలిచేసి నొవ్వనాడాడు. యెందుకులే నాన్నా అవన్నీ'' అని చెప్తుంటే పరాకళ్లు తడి అయినై. తండ్రి కళ్లు అద్దాడు తువాలాతో.

నిద్రపోవాలని మందు వాడితే, చెప్పటం ఆపేసి నిద్రలోకి జారింది పరా. బ్రీదింగ్ సమానంగా నార్మల్‌గా వుండటం గమనించి లేచాడు తండ్రి. ధారకం చూడాలి. తాను భోజనం చేయాలి.  తెలివిరాగానే పక్కన కుర్చీలో తండ్రి కనపడగానే చెప్పుకెళ్తూనే వున్నది పరా. వింటూ ఓదార్పుగా మాట్లాడుతూ వున్నాడు. క్రమంగా యేమీ తినలేక పోతున్నది పరా. లిక్విడ్ డయట్. పాయసం, పండురసం, మజ్జిగ, చల్లరసం,  చారు, నిమ్మవూరగాయ ముక్కతో కొంచెం వుప్మా తినగలుగుతున్నది. పైనాపిల్ షర్బత్, యాపిల్ షర్బత్ చేసి తాగించాడు తండ్రి. టిన్‌పాలల్లో ముంచి తినగలుగుతున్నది.

''నా వంటకు తప్పుపట్టి, గేలిచేసి విసిగించిన దాసు అదే మోస్తరు మరొకరు వండి భోజనం పెడితే, గుటుకూ గుటుకూ తింటూ పొగడితే, నిగ్రహం కోల్పోయి, వుండబట్టలేక అడిగాను నాన్నా'' నేను వండినట్లే వండింది, జగదాంబ మీ ఫ్రెండ్ భార్య. బాగానే తింటూ పొగిడారే?'' వెల్లుల్లీ, వుల్లీ, యింగువా, పసుపూ అన్నీ వాడింది పదార్థాలలో. గోంగూర పులుసులో వెల్లుల్లి, కంది పచ్చడిలో, పెసర పచ్చడిలో యింగువా వాడింది. దొండ వేపడం మీద పసుపు బెల్లం చల్లింది'' అన్నా.

''రుచిగా వుంది వంట. తింటున్నాను. అదీ తప్పే'' అని కసిరాడు దాసు.

విందుకి వెళ్లాము. మాంసాహారం, కోడి పలావ్, ఫ్రైడ్ చికెన్, ఎగ్ బోండా తినలేక చూస్తూ వుండిపోయా.

''తినవేం? అదేం మర్యాద. నీ కోసం స్పెషల్‌గా వండరు. పెట్టింది తినేయాలి'' అని బలవంతంగా తినిపిస్తే పెద్ద వాంతి అయింది నాన్నా. వేషాలు.

నటన అని వాళ్ల యెదుటే వురివాడు దాసు. వినగలవా నాన్నా? వినోదించగలవా?'' అన్నది. తలూపాడు తండ్రి. నీరసంగా నవ్వింది.

''వాళ్ల బంధువు ఒకామె పాతకాలం మనిషి విడో. వయసు మళ్లిందీ. అకాపై చేస్తున్నదట అమెరికాలో పదేళ్లనించీ కొడుకు కోడలు వద్ద వుండి గూడా. బంధువుకి పెన్షనిస్తారట. అది పెట్టి బంగారం కొని దానమిస్తుందిట. నేను వెళ్లి ఆ బంగారం యెవరికీ యివ్వకండి. నేను ముందుగానే వచ్చి మీ సేవ చేస్తాను అని ఫోన్‌చేసి వెళ్లి తెచ్చుకోవాలిట నాన్నా. యే కులమందామీ యే మతమందామీ దాసుది?''

''నేనే పిలవాలిట కమ్‌టు బెడ్ మిలార్డ్! అనాలిట డెస్డెమోనాలాగా. నేనే అన్ డ్రెస్ చేసుకుని, తనకూ చేయాలిట. నాలుగైదు సార్లుట''.

''బతిమాలాలా? కాళ్లు పట్టుకోవాలా. టీనేజరువా? అందరూ జులుమ్ చేస్తారు. మోటగా బిహేవ్ చేస్తారు. నేను లలితంగా, సాదరంగా, ప్రేమగా'' అంటుంటే

''నేను కాల్‌గర్లా?'' అన్నా నాన్నా.

''కాదు కాదు మహాసాధ్వివి. మహా పతివ్రతవు. ఓసారి చూపిస్తా నా తడాఖా. కాళ్ల బేరానికొస్తావు'' అని ప్రాక్టికల్స్ చేసి చూపాడు. తండ్రిదే కులమో అనుకున్నా . మోటువాడికి మొగలి పూలిస్తే అనే మోటు సామెత గుర్తొచ్చింది నాన్నా. నెత్తిన మొట్టికాయలు తింటున్నట్టు అనుభూతి కలిగింది. ఆడదాని ఫీలింగ్సు హర్ట్ చేయమని చెప్పేదే మతమో, నాన్నా!''

నేనందరినీ కించపరుస్తున్నట్టూ, అవమానిస్తున్నట్లు తాను ఆత్మవత్ సర్వభూతాని యఃపశ్యతిస పండితః అన్నట్లు వుంటున్నాననీ అనుకుంటూ, చెక్ చేస్తూ చెకింగ్ ఆఫీసరైనాడు దాసు.

ఏదో సుస్తీ యేదో నెల వచ్చేవరకు పీడించింది. అయినా యే పనిలో యిరికిస్తే ఆ పనిలోకి వెళ్తూనే వున్నా. నాతో స్ట్రీట్ కార్లో వచ్చే అమ్మాయి అననే

అన్నది'' హి వాంట్స్ టు కీప్ యు అండర్ హిజ్ థంబ్''. ఓరోజు నాతో యింటికి వచ్చింది. దానితో సరసం '' ఇక్కడందరూ జాబ్ చేసుకుంటూరు అంటే నువే చూడాలి జాబ్ అంటుంది. అన్నీ నేనే చూడాలిట''. ఈ లోకంలోకి రావటం యిష్టం లేనట్టు పిల్ల రాలేక రాలేక మెల్లిగా వచ్చింది యీ లోకంలోకి. నెలముందే వచ్చిందట.

''యేం తొందర? యేం పేరు పెట్టుకుంటా?'' అన్నాడు దాసు.

''లవంగమంజరి'' అన్నా. వెంఁటనే పకాపక నవ్వుతూ ఊయలలో వున్న పసికందుని చూసి, ''లవంగమల్లే వున్నది కనకనా. నేను నడిచి వెళ్తుంటే ఆడపిల్లలు చూసి మూర్ఛపోతారు. అంత మంచి రంగూ ప్రపోర్షనేట్ బాడీ నాది. ఇది నాకే పుట్టిందీ?'' అని హాస్యమాడాడు.

''మీరెవరికి పుట్టారో చెప్పగలరా? ఋజువు చేయగలరా?'' అని జుబేదా హాస్యమాడింది. ఆమె లేడీ డాక్టరు.

''నిన్ను నొప్పించినే బావుకున్నదిదే నాన్నా. వెళ్లాలి వెళ్లాలి నాన్న దగ్గిరి కెళ్లాలి అని తపించిపోయినా నాన్నా. పితృ దేవోభవ అన్నారు. నాన్నే నాకు ప్రత్యక్షదైవం. దైవంతో చెప్పుకోవాలి అని కలవరించా'' అన్నది.

క్రమంగా చెప్పటమూ తగ్గిపోతున్నది. కన్నార్పకుండా చూస్తుంది. తండ్రి చేతులు పట్టుకుని మొహానికద్దుకుంటుంది. లేవలేకపోతున్నది.

''సమయం కోసం చూశాను నాన్నా. దైవం మీద భారం వేశాను. డమ్మీలాగా, మైనం బొమ్మలాగా రోజులు నెలలు యేళ్లు గడిపాను. భగవాన్ నన్ను తీసికెళ్లు లేదా మా నాన్న దగ్గరకి చేర్చు అని చేతులెత్తేశా నాన్నా''.

మార్దవంగా అన్నాడు తండ్రి. ''మంచిపని చేశావమ్మా, ద్రౌపదీ దేవి లాగా. అలివిగానప్పుడు చేతులెత్తేసింది మహాతల్లి. ఆమె పరాయే తల్లీ. క్షమాశక్తి చూపే అవకాశమిచ్చాడు దైవం నీకు. పిల్లలు యెదిగి సమర్థులై, మేజర్లౌతూనే వుద్యోగులైనారు. మన వూరి రామేశం మీరున్నచోటికి పనిమీద వచ్చాడు.

కూతురుకి మంచి సంబంధం చూశాడట పెద్దల్లుడు. అన్నీ సెటిల్ చేయటానికి వచ్చాడక్కడికి. పిల్లల్ని గురించి ఆనందం కలిగేట్లు చెప్పాడు. మాయను గెలిచావు గనకనే దాసుని అంటిపెట్టుకునుండి, సత్పౌరులను సజ్జనులను యీ ప్రపంచానికిచ్చావు తల్లీ. వినయం, వివేకం పెద్దలందు భక్తి అలవరచటం తేలికగాదు అమ్మా. నీ పవర్ నీకు తెలియరాలేదు'' అని అనునయించాడు తండ్రి.

''విడిబడేందుకు మార్గము లేదు. లాలేదు నాకు వున్నది దైవమేనని చూస్తున్నా నాన్నా. దాసే వాయుయానం వివరాలు విని లాభం కనిపించగానే, నా ప్రయాణం సుకరం చేశాడు. కొన్నేళ్లు వాయుయానం చేసిన వారికి ఒకసారి ఫ్రీ ట్రావెల్ సౌకర్యమున్నదిట. తను అఫిషల్‌గానూ, కాన్ఫరెన్సులకూ వెళ్లేవాడు. ప్లేన్ యెక్కించి, ''మీ నాన్నను చూసిరా. చాలా పెద్దవాడై వుండాలి. సెప్తునేరియన్ లేదా సహస్రమాస జీవి అయివుండాలి. మరీ యెక్కడికీ పోయిరాకుండా యెవర్నీ చూసిరాకుండా, వెలివేసినట్లు, డిజోన్ చేసినట్లు యిక్కడే వుండిపోయావు. రెండు పుష్కరాలు గడిచిపోలేదూ? నేనెవర్నీ యింటికి తేనులే. అందగత్తెల వెంటబడి చీకట్లో తిరగనులే. స్త్రీలను చుట్టూ కూచోబెట్టుకుని, వారి ప్రైవేట్ యెఫేర్సు విననులే. రంకు పురాణాలు వినటానికీ వెళ్లను. ఒట్టు. తల్లితోడు ఏక పత్నీవ్రతం పడతా సరేనా'' అని నవ్వుతూ హాస్యమాడుతూ సెండాఫ్ యిచ్చాడు నాన్నా దాసు'' అని చెప్తూ తండ్రి చేతులు తన మొహానుంచుకున్నది పరమేశ్వరి. తండ్రికళ్లు తడి అయినై. పరమేశ్వరి చేతులు వదులై పక్కలకి జారినై.

''పరా! అమ్మా! యిపుడు మాట్లాడుతున్నావే'' అని కూతురు గుండెలమీద తల వుంచాడు తండ్రి.

''దాసు ఫ్రెండ్ హార్ట్ స్పెషలిస్టు నాన్నా. విందుకి వచ్చారు. భార్యా డాక్టరే. చాలా చక్కనిది. ఎంజాయ్ చేసివెళ్లి పోయారు దంపతులు. వీడికెవరు అలాటి పిల్లనిస్తారూ? లేవదీసుకొచ్చాడు'' అన్నాడు వారు వెళ్లినవేపు చూస్తూ. ''యెంత అసూయ! అలాటి తెలుగు పదాలు నాలుకమీద ఆడేవాడిదే కులమందాము నాన్నా? యెదిరించానుట. ''దెప్పకు దెప్పకు''అని వురిమి డేల్ కార్నేజ్‌పుస్తకాలు

కొనిచ్చి చదవమన్నాడు'' అంటున్నట్టు వినిపించి ప్రాణమున్నదేమో. ఊపిరాడుతున్నదేమోనని ముక్కు వద్ద వేళ్లుంచి చూశాడు రామచంద్రయ్య.

బుజం మీద చేయి పడితే తలెత్తి చూశాడు. రామేశం పక్కన నిలబడి ఉన్నాడు.

''పామరత్వమననా? మమకారమలా అనిపిస్తుందననా రామచంద్రయ్యా? నేను నీకు చెప్పేపాటి వాడినా?'' అన్నాడు నిలబడి.

''నా తల్లి! మా అమ్మ! స్టేట్స్‌కి స్కాలర్‌షిప్ మీద వెళ్లినట్టే ఒంటరిగా వెళ్లిపోయింది. తోడురమ్మనన్నా అడగలేదు. పరా! షష్టిపూర్తన్నా కాలేదు ఇంకా!'' అని కన్నీరు నింపాడు రామచంద్రయ్య.

''వీక్‌హార్ట్ అని స్పెషలిస్టు చెపితే నీ చేతుల్లో పోవాలని వచ్చింది కూతురు. ప్రాణాలు నిలబడిందందుకే. లే. లే'' అని లేవదీశాడు రామేశం.